

# దొరుంచుకున్న దేవక్క

"దేవక్క చచ్చిపోయిందట"

తెలతెలవారుతుండగానే తెలిసిన వార్తతో వూరు బరువుగా మూలిగింది....

ప్రభాతగీతం పాడుదామని గొంతు విప్పిన తొలికోడి నోరు తెరచి అలాగే వుండిపోయింది. తల్లి పొదుగులో తలదాచుకొన్న లేగదూడపాలు తాగటం మరచి మూగవోయింది. కనుసందుల్లోంచి వెలుగురేఖల్ని జారవిడుద్దామని రెప్పల చిప్పల్ని

తెరుస్తున్న సూర్యుడు సైతం ఆ వార్త విని చీకటినే పంచాడు.

చరిత్ర పుటల్లో ఎవరూ పట్టించుకోని ఓ నలిగిపోయిన పేజీ చిరిగిపోయినట్టు....

"దౌరుంచుకున్న దేవక్క చచ్చిపోయిందట..."

గుప్పుమన్న వార్త

ఆడామగా, పిల్లాజెల్లా అటువైపు కదిలారు.

నేనూ కదిలాను...

చీకటి పల్చబడుతోంది.

ఈ వూరికి దేవక్క గురించి ఏడ్వడానికి కన్నీళ్ళులేవు. మాట్లాడడానికి భాషే లేదు. నడుస్తుండగానే చీకట్లో కూచున్న కాముని భూతంలాగా శిథిలమైపోయిన 'గఢీ' కన్పించింది. అది చూడగానే నా గుండెను బాయినెట్‌తో కెలికినట్టు బాధ.

దేవక్క జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేసిన గఢీ....

ఇరవై ఏళ్ళకిందే పట్నానికి పారిపోయి పారిశ్రామికవేత్తగా కోటీశ్వరుడైన ఆనందరావ్ దొరకి... దేవక్కా ఇంకా గుర్తుందా?

xxx xxx xxx

ముప్పయ్ ఏళ్ళకింద...

గవర్నమెంట్ టీచర్‌గా మొదటిసారిగా ఆ వూర్లో అడుగుపెట్టినప్పుడు... డప్పుల్తో ఒక ఊరేగింపు ఎదురైంది. ఊరేగింపు మధ్యలో ఓ నలుగురు దుప్పటిని

నాలుగుమూలలా పట్టుకొని పైకి లేపితే మధ్యలో ఒకరు కట్టెతో దాన్ని మరింత పైకిలేపాడు. ఆ దుప్పటి నీడన ఓ పెళ్లి జంట. ముఖ్యంగా ఆ అమ్మాయిని చూసి ముగ్ధుడైపోయాను. పల్లెల్లో ఎంతటి సౌందర్య రాశులుంటారో ఆమెని చూసాకగాని తెలియలేదు.

ఆమే... దేవక్క

దేవక్క పెళ్ళి చేసిన పంతులు ఓసారి నవ్వుతూ చెప్పాడు. "దాని అందం చూసి మంత్రాలే మర్చిపోయాను. ఏదో 'మమ' అన్పించాను తప్పితే దాని మొగుడితో నాతి చరామి అన్పించాలని కూడా గుర్తురాలేదనుకోండి"

ఆనందరావ్ దొర గడిలోనే ఓ గదిలో నేను పాఠాలు చెప్పేబడి. చిత్రంగా నలుగురే పిల్లలు... ఒకడు ఆనందరావ్‌దొర కొడుకుకాగా, ఇద్దరు పటేల్ గంగన్న కొడుకులు. మరొకడు పట్వారీ రాములు కొడుకు. దొరకొడుకు మాత్రం స్టూల్‌మీద కూచుండేవాడు. పల్లికాయలు కొట్టి తినిపిస్తూ నేను అతడికి చదువు చెప్పాలి.

ఒకరోజు గదిలో నేను పాఠం చెప్తుంటే ... దేవక్కని, ఆమె పెనిమిటిని తీసుకొచ్చి దొరకాళ్ళు మొక్కించారు కులపెద్దలు.

దేవక్క అందం చూసి దొరసాని మొహంలో రంగులు మారినయ్.

ఎనిమిది మానుకల బియ్యం కొలిచాక... వాళ్లు వెళ్లిపోయారు.

దొర్సాని దేవక్కని తన ఇంటి పనుల్లోకి పంపమని కోరగానే... దేవక్క పెనిమిటితో సహా ఉబ్బితబ్బిబ్బయ్యారు. మర్నాటినించే దేవక్కకి దొర ఇంట్లో పని దొరికింది. పొద్దున్నే అర ఎకరమంత వాకిలూడ్చి, కల్లాపి చల్లి దొర్సాని చెప్పిన

పనులన్నీ చేస్తూ కూచోవాలి. దేవక్కని చూసినప్పుడల్లా... ఆ అందానికి దొర్సాని మనస్సు చివుక్కుమనేది. ఎండలో రెండు గంటలు బావి నీళ్ళు తోడించినా... ఎర్రగూలాబీలా అయ్యే దేవక్క అందానికి భగభగమని గుండెమండేది. ఆ అందాన్ని తానే సొంతం చేసుకోవాలన్పించేవి ఆమె చూపులు... అందుకేనేమో... ఆరోజు వూహించని పని చెప్పింది.

చలి పిడుగు పడ్డట్టు వణికిపోయిన దేవక్కని... గుడ్లురిమి చూసింది. ఫలితంగా లేడిపిల్లలా వణుక్కుంటూ దొర గదిలోకి పోయింది.

ఒక డామినేటింగ్ మనస్తత్వం వున్న ఆడది... మరో ఆడదాన్ని గెలవాలనుకుంటే నైతికంగా కూడా ఎంతకైనా తెగించగలదు అనే విషయాన్ని ఆ గడీలో గమనించాను.

పైకి నిశ్శబ్దంగా కన్పించే ఆ గడీలో... ఎన్నెన్ని నీలినీడలు?

దేవక్క అందాల్ని రుచి చూసిన దొర కూడా రక్తం మరిగిన పులే!

తర్వాత దేవక్క భర్త ఎలా పోయాడో గాని... బతుకమ్మ పండగరోజు చెరువులో మునిగిపోయాడు. పూలపూల బతుకమ్మల నడుమ తేలిన వాడి శవాన్ని దొరే దగ్గరుండి తీయించి అంత్యక్రియలు జరిపించాడు.

బొట్టులేక... ముండరాలైన దేవక్కలో 'కళ' తప్పిన మొహంచూసి దొర్సాని పెదాలమీద చిరునవ్వులు కదలాడేవి.

పెనిమిటి పోయిన బాధలో చిక్కిపోతుంటే... ఉన్నట్టుండి పని మానెయ్యమని దొర్సాని హుకుం జారీ చేసింది. కానీ... దొరనే దేవక్క ఇంటికి

వెళ్లటం మొదలెట్టాడు.

అప్పట్నించీ ఆమె... దొరుంచుకున్న దేవక్కగానే మిగిలిపోయింది.

-: 2 :-

గడీమీద నక్సలైట్లు దాడి చెయ్యబోతున్నారన్న విషయాన్ని పసిగట్టి అనందరావ్‌దొర అర్ధరాత్రి అంతా సర్దుకొని హైదరాబాద్ పారిపోయాడు. వెళ్లాక గాని దేవక్కకి తెలియలేదు.

తెలిసాక బతుకేమిటో అర్థంకాలేదు... వెక్కివెక్కి ఏడ్చింది.

ఓదార్చడానికొచ్చిన పటేల్ గంగన్న నడుంమీద చెయ్యేసాడు. విదిలించింది. విషయం తెలిసిన పట్వారి రాములొచ్చి దగ్గర తీసుకొని వీపు నిమురుతుంటే దూరం జరిగింది.

ఓ అర్ధరాత్రి... నక్సలైట్లు గడీని పేల్చేయాలని వచ్చి 'పరమపద సోపానపటం'లా వున్న గడీలోకి వెళ్తే... ఎక్కణ్ణించి ఎటు వెళ్తుందో అర్థంకాని స్థితిలో నక్సలైట్లకి ఏం తోచలేదు.

వరండా దాక తప్ప అసలు గడీలోకి సరైన దారి దొరకలేదు.

ఒకరిద్దర్ని పిలిచి అడిగిన ఫలితం లేకపోయింది. అప్పుడు తెల్సింది వాళ్లకి దేవక్క పేరు!

దిగులుగా మంచంమీద పడుకున్న దేవక్కకి తలుపు చప్పుడైంది అర్ధరాత్రి.

అనుమానమొచ్చినా ఆదుర్దాగా తీసింది.

ఎదురుగా సాయుధులు!!

"అక్కా... గడీలకు దారి తెలీటం లేదు. వచ్చి చూపిస్తావా?" అన్నాడొకాయన. దేవక్కకి అర్థమైంది.

దిగ్భ్రాంతిగా చూస్తూ "మీరు... మీరు అన్నలా ....? అనడిగింది.

"అవును..."

"దొర పారిపోయిండు గదా . . ." అంది.

"భూముల్లో జెండాలు పాతొచ్చాం. గడీని పేల్చేయాలి"

"గడీని పేల్చితే ఏమత్తది? ఈవూరి మనుసుల్లోంచి దొర మాసిపోతాడా? గడీ మాసిపోతదా?"

"మాసిపోవాలె... బూర్జువా వ్యవస్థనే మాసిపోవాలె. సమసమాజం రావాలె. అందుకే మా పోరాటం" ఒకతను ఆవేశంగా అన్నాడు.

"నేనేం చెయ్యాలె...? అయోమయంగా అడిగింది.

"ఏంలేదు దేవక్కా... గడీ పాముల పుట్టోలె వుంది. ఏదారి ఎటు పోతదో తెల్తలేదు. గడీ లోపలికి దారి చూపించు. నీకు తెల్సని చెప్తే వచ్చినం..."

దేవక్కకి ఏమీ పాలుపోలేదు.

"మాతోరా..." ఆజ్ఞాపించినట్టుగా వుందా మాట.

"నేను రాను" భయంగా అంది.

'వస్తావా? లేదా?' గుడ్లురిమి చూసాడు నాయకుడు. బొమ్మలా కదిలింది. గడీ మొత్తం చూపించింది.

రెండు గంటల తర్వాత తెలతెలవారుతుంటే... బాంబుల శబ్దాలతో గడీ దద్దరిల్లిపోయింది. బురుజులన్నీ నేలకొరిగాయి. మంటలు ఆకాశానికెగిసి వూరంతా పొగకమ్మింది. విషయం అర్థమై తర్వాత ఏం జరుగనుందో తెల్సి... వూరు మాత్రం గజగజా వణికి పోయింది.

అప్పటికే... దేవక్కే గడీ మొత్తం చూపించిందట అన్న విషయం చరచరా పాకిపోయింది.

-: 3 :-

వూరంతా నిర్మానుష్యం . . .

యువకులంతా చుట్టాలిండ్లకి పారిపోయారు. పోలీస్ వ్యానులు ఏడెనిమిది వరకూ వచ్చి ఆగాయి.

ఊరంతా ఖాకీ వాసన. గాలి సైతం భయపడుతున్నట్టు నిశ్శబ్దం. బిక్కుబిక్కుమంటున్న వూర్లో పోలీసులు

ఎవర్నీ ఏమీ అన్లేదు.

దేవక్క ఇంటిముందు జీపుని ఆపేసి... బరబరా ఈడ్చుకొచ్చి బూట్లతో తన్నారు... కొట్టారు... గుద్దారు...

దేవక్క అరుపులకి తలుపు సందుల్లోని గుండెలు విలవిలలాడాయి. రెప్పల్ని

తెంపేసుకున్న చూపులు కన్నీటిలో తెగి పడ్డాయి.

తన నోటితో కనీసం పలకరాని పేరుని దేవక్కకి అంటించారు.

దేవక్క... ఇన్ఫార్మర్.

జీపులో పడేసిన దేవక్కని తీసుకొని పోలీసులు వెళ్లిపోయారు. వూరంతా శోకమైపోయింది. నోరు విప్పని శోకమది.

నాల్రోజుల తర్వాత... శవంలాంటి దేవక్కని ఇంటిముందు పడేసిపోయారు.

పిచ్చిదాన్లా అయిపోయి... శరీరమంతా వాతలు తేలిన దేవక్కని మందలించడానిక్కూడా భయం... భయం...

ఒకరిద్దరాడవాళ్లు మాత్రం దేవక్కని చూసి శోకమేసారు.

ఈవూర్లో అడుగుపెట్టినప్పుడు... మందారంలా వున్న దేవక్క ఇప్పుడు నెత్తుటి ముద్దే అయింది. నడవలేక పోయింది. కడుపులో పేగులు అల్లకల్లోలమయ్యాయేమో... ఉమ్మితే రక్తం పడేది. పక్కింటి నాగమ్మ ఆమెను చూసి తల్లడిల్లేది. ఓరోజు దేవక్క పరిస్థితిని చూద్దామని వెళ్లిన నా కాళ్లమీద పడి నాగమ్మ శోకం పెట్టింది.

“దొరింట్ల పీనుగెల్ల... సుక్కటువోంటి బిడ్డను సెడగొట్టె... బతుకమ్మ పండుగనాడే బిడ్డను ముండమోపె... దాని పచ్చని సంసారంల నిప్పులు వోసి పట్నాలు పట్టుకుపోయిండు సారూ... దాని గోస సూత్తె కడుపు చెరువైతంది సారూ... అది మనిషి కావాల్నంటే ఎన్ని పైసలు గావాలె... అంటూ ఏడ్చింది.

దేవక్క కళ్లల్లో సుడులు తిరుగుతున్న కన్నీళ్లు...

నేను రెండొందలు తీసిస్తూ...

"మనూర్లె ఆరెంపీ డాక్టర్‌కి సూపియ్యుంగ్రి" అన్నాను.

"నాకు పైసలద్దు సారూ... సదువు నేర్పుంగ్రి... ఎక్కడికన్నావోయి బతుకుత" అంది దేవక్క

"పర్లేదు. ముందు నీ ఆరోగ్యం మంచిగ గావాలె. తర్వాత చదువు నేర్చుకోవచ్చు" అని బలవంతంగా డబ్బుంచి వచ్చాను.

దేవక్క మనిషయ్యేసరికి ఆరునెలలు పట్టింది.

కండపట్టిన దేవక్క వైపు కొన్ని కళ్లు కామంతో కాపలా కాస్తూనే వున్నాయి. కాని దేవక్కని దురదృష్టం మరోసారి వెంటాడింది... వేటాడింది....

ఒరోజు సాయంత్రం దేవక్క దగ్గరికి ఒకతను వచ్చాడు. ఉద్యమంలో పనిచేసే అతడు గడీ పేల్చేయడానికి సాయం తీసుకున్నందుకు... పోలీసులు పెట్టిన బాధలకి పశ్చాత్తాపపడ్డాడు. తమ వల్ల జరిగిన అన్యాయానికి బాధపడ్డాడు.

'నువ్వొప్పుకుంటానంటే నేను పెళ్లి చేసుకుంటాను' అన్నాడు.

దేవక్క నిర్లిప్తంగా నవ్వింది.

ఆ నవ్వుని అర్థం చేసుకున్న అతడు "నేను ఉద్యమంలోంచి బయటికి వద్దామనుకుంటున్నాను. ఆ బంధాలన్నీ తెంపుకున్నాకే... మనం పెళ్లి చేసుకుందాం..." అన్నాడు.

దేవక్క ఆలోచనలో పడిపోయింది. బయట చీకటి పడింది.

కాని అప్పటికే... ఆ ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. లొంగిపొమ్మనే హెచ్చరికలు మిన్నుముట్టాయి.

గువ్వపిల్లలా వణికిపోయింది దేవక్క.

అతడు జేబులోంచి పిస్టల్ తీసి కాల్పులు జరపటం మొదలెట్టాడు. కాని అప్పటికే ఇంటికి నిప్పంటుకుంది.

అతడు దేవక్కని బయటికి వెళ్లమని అరిచాడు.

తెగింపు. . . తెగింపు . . .

మంటల్లోంచి ఒక్క ఉదుటున చీకట్లోకి పరిగెత్తింది.

పరుగు... పరుగు... పరుగు...

కాల్పులు... మంటలు... అంతా బీభత్సం.

అరగంట తర్వాత కాలిబూడిదైన ఆ ఇంట్లో... మాడిపోయిన ఓ శవం...

'నక్సలైట్లకు ఎవరు ఆశ్రయమిచ్చినా ఖబడ్దార్' పోలిస్ జీపులు రొదపెడుతూ పోయాయి.

దేవక్క ఆరోజునించీ... ఎవరికీ కన్పించలేదు.

ఎన్నో పుకార్లు... షికార్లు చేసాయి దేవక్క శరీరంమీద.. జీవితం మీద...

కాలిపోయి కూలిపోయిన ఆ పెంకుటింటిని చూసినప్పుడల్లా... శోకమూర్తిలా కూచున్న దేవక్క గుర్తొచ్చి నా మనసు మాత్రం కలుక్కుమనేది.

-: 4 :-

ఎనిమిదేళ్ళు గడిచాయి........

వూరు దేవక్కని దాదాపుగా మర్చిపోయింది.....

ఆరోజు సాయంత్రం సన్నగా వర్షం పడుతోంది. . . పడుతూ లేస్తూ వచ్చిన ఆర్టీసి బస్సులోంచి చేతి సంచితో దిగింది దేవక్క.

హోటల్లో చాయ్ తాగుతున్న వాళ్లంతా కళ్లు చిట్లించి చూసారు. కాని గుర్తుపట్టలేదు. పట్టే స్థితిలో దేవక్కలేదు.

వారం కింద తెంపిన తెల్ల గులాబీలా పూర్తిగా వాడిపోయింది. ఎంతో మారిపోయిన వూరిని బిత్తరపోయి చూస్తుందామె.

సాయంత్రం స్కూలు విడిచి వస్తున్న నేను దేవక్కను తొందర్లోనే పోల్చుకున్నాను. గబగబా వర్షంలోనే తడుస్తూ ఆమె దగ్గరికి నడిచాను.

నన్ను చూడగానే ఆమె పెదాలు వణికాయి...

"మీరు... మీరు... సార్ కదూ..." అంది. గొంతు పెగలటం లేదు.

"అవును... నేనే... ఇన్నిరోజులూ ఏమైపోయావ్? ఎక్కడికెళ్ళావ్?" నాలో ఆదుర్దా

"బతుకు భయంతో పారిపోయాన్సార్... వలసపోయాను"

"అదే ఇన్నాళ్లూ... ఎక్కడున్నావ్?"

"కామాటిపురా...."

తుళ్లిపడ్డాను.

"మరిప్పుడు?"

"వాళ్లా తరిమేసారు"

"ఎందుకు?"

"ఎ...యి...డ్స్..."

నెత్తిన పిడుగుపడ్డ శబ్దం. భూమి సర్రున చీలినంత భయం నిలువెల్లా పాకిపోయింది.

దేవక్క వడివడిగా అడుగులేసుకుంటూ వూర్లోకి నడిచింది.

చిత్రంగా... తన ఇల్లుండాల్సిన చోట... ఖాళీస్థలం కూడా లేదు.

'పశువుల దవాఖాన' అనే బోర్డుతో వెలిసిన బిల్డింగ్ కనబడింది. పూర్తిగా తడిసిపోయి... నిశ్చలమై నిల్చుంది దేవక్క. అస్థిపంజరానికి తోలు తొడిగినట్టు శిథిలమైపోయింది.

ఆమెను గుర్తుపట్టిన ఊరు వర్షంలోనే కదిలివచ్చింది.

శిథిలమైపోయిన ఆమెను చూసి కరిగిపోయింది. కాని అప్పటికే ఆమెకు సోకిన భయంకరమైన రోగం గురించి తెలిసి... దూరదూరంగా వుండి బెరుకుబెరుగ్గా మందలిస్తున్నారు. ఏమైపోవాలో... ఎక్కడికి వెళ్లాలో తెలీక... చలి వణికిస్తుంటే వెటర్నరీ ఆస్పత్రి వరండాలో మూలగా ఒదిగి కూచుంది.

ఆమెనంతా చిత్రంగా చూసి వెళ్తున్నారు.

అప్పుడే... పోచమ్మ తల్లికి నైవేద్యం పెడుతూ... డప్పుల చప్పుడుతో వెళ్తున్న ఊరేగింపు చూసింది. తన పెళ్లి ఊరేగింపు గుర్తొచ్చింది... భర్త గుర్తొచ్చాడు... దొర్సాని గుర్తొచ్చింది... దొర గుర్తొచ్చాడు... నక్సలైట్లు... పోలీసులు... తన జీవితాన్ని ఎయిడ్స్ క్రిమికన్నా భయంకరంగా పొడిచేసిన వాళ్లంతా గుర్తొచ్చారు.

దుఃఖం రాలేదు. అది ఏనాడో మర్చిపోయింది.

మర్నాడు...

పొద్దున్నే నా ఇంటిముందు నిల్చున్న దేవక్కని చూసి ఆశ్చర్యపోయాను.

"ఏం కావాలమ్మా..." అనడిగాను ఆప్యాయంగా. అంతా వెలివేసిన చూపుల్తో చూస్తుంటే ఆ పిలుపు ఏ గుండెల్ని తాకిందో... కదిలిపోయి కనుకొసల్లో కన్నీరు తొణికిసలాడింది.

"సారూ... ఇయ్యాల వూర్లో న్యాయవేదిక వాళ్లొస్తుండ్రట. గ్రామ పంచాయితీ వాళ్లనించి నా భూమి నాకిప్పియ్యుండ్రి. ఒక అప్లికేసను రాసియుండ్రి." అంది ప్రాధేయపూర్వకంగా.

నాకూ నిజమేనన్పించింది. గ్రామ పంచాయతీ నించి నష్టపరిహారం కోరుతూ... విజ్ఞాపన పత్రం రాసిచ్చాను. దాన్ని న్యాయవేదికలో ఇచ్చింది. వాళ్లు అది తీసుకొని మళ్లీ వచ్చినప్పుడు తీర్పిస్తామన్నారు.

అది సర్పంచ్‌కి నచ్చలేదు.

దేవక్కని పీడించటం మొదలెట్టాడు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తురాలు వూర్లో వుండొద్దని ప్రచారం చేసి... పరంపోగు భూముల్లో ఓ గుడిసె వేయించి తరిమెయ్యాలని చూసారు. కాని దేవక్క... ఆస్పత్రి వరండాలోంచి కదల్లేదు... ఆ స్థలాన్ని వదల్లేదు... పంచాయితీ వాళ్లు తన ఇంటి భూమిని ఆక్రమించుకున్నందుకు దేవక్క పోరు ఎక్కువైంది. వూర్లోకి ఏ అధికారి వచ్చినా మొరపెట్టుకునేది. వాళ్లు దూరదూరంగా నిలబడి... ఓ పురుగుని చూసినంత అసహ్యంగా ఆమె ఇచ్చే అప్లికేషన్లు తీసుకొనేవాళ్లు.

ఏడాది...

రెండేళ్లు...

మూడేళ్లు గడిచాయి... ఈ మూడేళ్లలో నేను నలభై అప్లికేషన్లయినా రాసిచ్చివుంటాను. దేవక్క ఆరోగ్యం పూర్తిగా పాడై... చిక్కి శల్యమై పోతోంది.

అయినా.. ఆమె భూమి ఆమెకు దక్కలేదు.

పిల్లలు అప్పుడప్పుడూ పిచ్చిదనుకొని రాళ్లు రువ్వేటోల్లు... హాస్పిటల్ కొచ్చిన రైతులు కసురుకునేవాళ్లు.

ఆస్పత్రి డాక్టర్, ఏయిడ్స్ రోగి ఆ వరండాలో వున్నంతకాలం నేను రానంటూ... దేవక్కని అడ్డం పెట్టుకొని నెలకి రెండు మూడుసార్లే వచ్చేవాడు.

జుత్తు చెరిగిపోయి... కళ్లు లోపలికి పోయి... చర్మం వొదులుగా వూగిసలాడుతూ భయంకరంగా మారుతోన్న దేవక్కని చూసి... కొందరు ఆడవాళ్ల గుండెలు దడదడలాడేవి. కొంపదీసి ఇలాంటి రోగం తమక్కూడా వుందా... ఈ ముండ ఈ వూర్లోకి రాకున్నా ఈ భయం పట్టుకునేది కాదని మనసులో

తిట్టుకునేవారు.

నులక మంచంలోంచి ఇక లేవలేని స్థితికొచ్చింది దేవక్క...

ఈగలు సైతం చీల్చుకుతింటున్నా... కదల్లేని దారుణమైన స్థితి.

ఆరోజు రాత్రి తొమ్మిది గంటలకి ఓ వ్యక్తి మా ఇంటికొచ్చాడు. కొంచెం చదువుకున్నవాడిలాగే వున్నాడు.

"నేను దేవక్కకు మరిదినవుతాను సార్... దేవక్క మా దూరపు బంధువు" అన్నాడు. ఆశ్చర్యపోయాను. అతడు ఈ వూరివాడే అయినా ఏనాడూ ఈ మాట చెప్పలేదు. అయినా సంతోషించాను.

"దేవక్కని మేం చూసుకుంటాం సార్... రేపు చనిపోయినా మేమే కాల్చేస్తాం. కాని... దేవక్క ఇంటి జాగాని ఆక్రమించుకున్నందుకు ఇరవైవేల నష్టపరిహారం గ్రామ పంచాయతీ వారు దేవక్కకు చెల్లించాలని ఈ రోజే కోర్టు నోటీసులు పంపింది..." అన్నాడు.

ఖంగుతిన్నాను.

అప్పుడే నాగమ్మ వచ్చింది. ఒకప్పుడు దేవక్కకు సాయపడ్డావిడ.

"అయ్యా... దేవక్కని మొదట్నించి చూసుకున్నది నేనే. ఇరవైవేలచ్చేసరికి చుట్టాలు పుట్టుకొస్తుండ్రు... గా పైసల్ దేవక్క బోయినంక నాకే అచ్చేటట్టు సూడాలె..." అంది.

వచ్చినతడు, నాగమ్మ కాసేపు అరుచుకున్నారు. పోట్లాడున్నారు. చివరికి

రాజీపడ్డారు. ఆ డబ్బు సర్పంచ్‌గాడే మింగకుండా ఓ కంట కనిపెట్టాలని నిర్ణయించుకొని వెళ్లిపోయారు.

నా మనసంతా బాధ... దుఃఖం అవరించాయి... రాత్రి చాలాసేపటి వరకూ దేవక్క జీవితం గురించే ఆలోచిస్తూ కూచుండి పోయాను. కానీ... తెల్లారేసరికే... చలిపిడుగులాంటి వార్త దేవక్క చచ్చిపోయిందట...

కాలికి ఏదో తగలటంతో ఈ లోకంలో కొచ్చి పడ్డాను.

-: 5 :-

తెల్లవారింది.

మంచంలోనే దిక్కులేనిచావు...

నా కళ్లు తడిసి ముద్దయ్యాయి. ఆడాళ్లంతా ముక్కుకి కొంగులడ్డం పెట్టుకొని వస్తున్నారు. మగాళ్ళేమో.. ఒకప్పటి దేవక్క అందం గురించి చర్చిస్తున్నారు.

అప్పటికే ఎనిమిదయింది.

ఎవరూ ముందుకు రాకపోయినా... రాత్రి నా దగ్గరికి వచ్చిన వ్యక్తి, నాగమ్మ వెదురుకట్టెలతో పాడె కట్టారు.

అప్పుడే ఎవరో వచ్చి నాతో అన్నారు.

“సార్... పన్నెండేళ్ల తర్వాత దొర మల్లా వచ్చిండు. ఆనందరావ్ దొర ఇప్పుడే వూర్లెకచ్చిండట.” అని.

నేను వేగంగా అటువైపు కదిలాను. అప్పటికే ఆనందరావ్ కారు చుట్టూ

జనం వున్నారు. ఆనందరావ్ చాలా బలిష్టంగా, తెల్లగా అయ్యాడు. రాజకీయ నాయకుడిలా కన్పించాడు. నేను వేళ్లేసరికి వూర్లో వాళ్లతో సంతోషంగా అంటున్నాడు.

"నక్సలైట్లు దేవుళ్లురా... వాళ్లే మరో పదేళ్ల ముందు పారిపోయేలా చేసివుంటే హైద్రాబాద్ సిటీని సగం కొనేసి వుండేటోన్ని. నేనే కాదు. నాలాంటి దొరలంతా పల్లెలు వదిలాక పారిశ్రామికవేత్తలయ్యారు. ఏవన్ కాంట్రాక్టర్లయ్యారు. కాలేజీలకు, హాస్పిటల్లకు, రియల్ ఎస్టేట్లకూ ఓనర్లయ్యారు...

విప్లవం వర్ధిల్లాలని పట్నాల్లో దొరలు పూజలు చేస్తాం. విప్లవం అంటే మాకు ప్రేమ... భక్తి, గిక్కన్నేవుంటే గడీల్నే పడివుండేటోన్ని. మీ అందర్నీ చూసిపోదామని వచ్చిన. రేపోమాపో ఎమ్మెల్యే టికెట్ వచ్చేటట్టుంది. అందరూ నాకే ఓట్లేయాలే..." అన్నాడు.

నన్ను చూసి "పంతులూ... ఈ వూర్లనే సెటిలయినవా? బాగున్నావా?" అనడిగాడు. నేను వెళ్లి పలకరింపుగా షేక్‌హ్యాండ్ ఇచ్చాను.

ఇంతలో కొందరు గుంపుగా శవాన్ని ఎత్తుకెళ్లటం చూసి

"ఏమయింది... ఎవలో చచ్చిపోయినట్టున్నారు." అన్నాడు.

"దేవక్క చచ్చిపోయిందండీ..."

అన్నాను అదుర్దాగా.

"దేవక్క ఎవరు?" అన్నాడు నొసలు చిట్లించి. అక్కడున్న అందరి మనసుల్లోను ఏదో బాధ తీగలా సాగింది.

"ఆమెకెవరూ లేరా? కనీసం దప్పులన్నా మోగుతలేవ్" అన్నాడు తిరిగి.

"దేవక్క..." అంటూ నేనేదో గుర్తు చేయబోయాను. కాని మరెవరో కన్పించటంతో మాటల్లో పడిపోయాడు.

అరగంట తర్వాత గడీలో పాడుపడ్డ గదులన్నీ స్కూలుకీ, దవాఖానాకీ, కమ్యూనిటీ హాల్‌కి వాడుకొమ్మని 'దొర ధర్మాత్ముడు' అన్పించుకొని రివ్వున కారెక్కిపోయాడు.

దేవక్క శవం తూర్పు దిక్కువున్న స్మశానం వైపు తరలిపోయింది.

దొర కారు పడమటి వైపున నేషనల్ హైవే వైపు దూసుకుపోయింది.

ఉత్తరాన వున్న గుట్టల్లోంచి నక్సలైట్లు ఉరికురికి వస్తుండ్రు...

దక్షిణం వైపునించి పోలీసులు పెట్రోలింగ్ పేరుతో అడుగుపెట్టారు.

నాలుగు దిక్కుల నడుమ... నేను...

చచ్చిపోయిన దేవక్కలా...

నా తెలంగాణా పల్లె... దిగ్బంధనమైనట్లు...

*